సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



విభిన్న కథాంశంతో
లవ్ మౌళి 8లో



ఐదేళ్లు.. అభివృద్ధి పరవళ్లు
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ప్రత్యేక ఫోకస్‌తో విశాఖ నగరం అభివృద్ధి పథంలో పయనించింది. 8లో



కూల్.. చిల్ 8లో

శుభాలు నిండుగా..

ఆలయాలకు ఉగాది శోభ

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు తరలివచ్చి.. దేవతా మూర్తులను దర్శించుకున్నారు. పండగ సందర్భంగా ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయ ప్రాంగణంలో కొత్త వాహనాలకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రమా సత్యనారాయణస్వామి ఆలయం, అంబికా బాగ్ సీతారామ ఆలయం, పూర్ణామార్కెట్‌లోని దుర్గాలమ్మ ఆలయం, తదితర ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ఆయా చోట్ల నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు. బంగారు, ఎలక్ట్రానిక్ దుకాణాలు సందడిగా కనిపించాయి.

– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం



కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

భక్తులతో కిటకిటలాడుతున్న ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయగర్ ఆలయం





అంబికా బాగ్ శ్రీ సీతారామ స్వామి



పూర్ణామార్కెట్‌లో కొలువైన శ్రీ దుర్గాలమ్మ

న్యూస్‌రీల్

బ్యాంకాక్‌కు విమాన సర్వీసులు పునఃప్రారంభం



ప్రయాణికురాలికి తొలి టికెట్ అందిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజా రెడ్డి

గోపాలపట్నం: విమాన ప్రయాణికులకు శుభవార్త. వేసవి సీజన్‌లో ఎయిరాసియా విమానయాన సంస్థ బ్యాంకాక్‌కు సర్వీసును బుధవారం పునఃప్రారంభించింది. విమానాశ్రయం టెర్మినల్ భవనంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తొలి ప్రయాణికురాలికి స్వాగతం పలికి టికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత బ్యాంకాక్ సర్వీసు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రయాణికులకు ఈ వేసవిలో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సర్వీసు బుధ, గురు, శనివారాల్లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 11.50 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి బ్యాంకాక్‌కు 4.15 గంటలకు చేరుకుంటుంది. బ్యాంకాక్ నుంచి రాత్రి 10.05 గంటలకు బయలుదేరి విశాఖకు రాత్రి 12.50 గంటలకు చేరుకుంటుంది.

బ్రూనై చేరుకున్న 'పహెరేదార్'



మురాకు చేరుకున్న భారతీయ తీర రక్షణ దళ నౌక సముద్ర పహెరేదార్ సిబ్బంది

సింధియా: ఇండియన్ కోస్ట్‌గార్డ్ పొల్యూషన్ కంట్రోల్ వెసెల్ సముద్ర పహెరేదార్ బ్రూనైలోని మురాకు చేరుకుంది. 2022లో కంబోడియాలో జరిగిన సమావేశంలో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించినట్లుగా.. సముద్ర పహెరేదార్ ఆషియన్ దేశాలను సందర్శిస్తోందని నేవీ వర్గాలు తెలిపాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా సముద్ర కాలుష్య నివారణ, మారిటైమ్ సెర్చ్ అండ్ రెస్క్యూ, మారిటైమ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాలపై ఇరు దేశాల కోస్ట్‌గార్డ్ బృందాలు చర్చిస్తాయి. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని నేవీ అధికారులు వివరించారు. పునీత్ సాగర్ అభియాన్‌కి దోహదపడుతూ సముద్ర పహెరేదార్‌లోని 25 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్, అక్కడి యువజన సంస్థల సహకారంతో బీచ్ క్లీన్ కార్యక్రమం నిర్వహించారు.

వేడుకగా పెళ్లి రాట



కల్యాణ రాట వేస్తున్న ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో రాంబాబు


దాబాగార్డెన్స్: అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం సీతారామ చంద్రస్వామి పెళ్లి రాట మహోత్సవం వేడుకగా సాగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం కల్యాణ రాట వేసి, స్వామిని పెండ్లి కుమారుడిని చేశారు. అనంతరం విశేష ఆరాధన, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఏఈవోలు వి.రాంబాబు, తిరుమలేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు బాలు పాల్గొన్నారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-కటక్-హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 16, 23, 30వ తేదీల్లో (ప్రతీ మంగళవారాల్లో) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 17, 23, మే 1వ తేదీల్లో (ప్రతీ బుధవారాలలో) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

జంప్ జిలానీలకు రాజపూజ్యం.. నమ్ముకున్నోళ్లకు అవమానం

- అధినేతల దెబ్బకు ఆశావహులు అబ్బా
- ఏళ్ల తరబడి టీడీపీ, జనసేనలకు చాకిరీ
- తీరా ఎన్నికల వేళ దగా
- ఉగాది పూట ఉసూరుమంటున్న నాయకులు
- తమ భవిష్యత్తుకు గండి కొట్టారంటూ ఆవేదన



సాక్షి, విశాఖపట్నం: జంప్ జిలానీలకు రాజపూజ్యం.. నమ్ముకున్న నేతలకు అవమానం..! ఇది జనసేన, టీడీపీ నాయకులకు ఆ పార్టీల అధినేతలు ఇచ్చిన బహుమానం. ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీల కోసం ఏళ్ల తరబడి కొంతమంది నాయకులు పనిచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు టికెట్ కచ్చితంగా వచ్చి తీరుతుందన్న నమ్మకంతో ఉన్నారు. తీరా సీట్ల ఖరారు చేసే సమయం వచ్చేసరికి వీరు అక్కరకు రాకుండా పోయారు. నమ్ముకున్న వారికి కాకుండా నిన్న గాక మొన్న పార్టీలో చేరిన వారికే అవకాశం కల్పించారు. కష్టపడి పనిచేసిన వారిని పక్కన పెట్టేశారు. ఎన్నికల వేళ తమ అధినేతలు కొట్టిన దెబ్బకు వీరంతా అబ్బా అంటున్నారు. ఇలాంటి వారంతా ఉగాది పండుగ వేళ తమ భవిష్యత్తును ఊహించుకుని ఉసూరుమంటున్నారు. తమకు రావలసిన అవకాశాలను పార్టీ ఫిరాయింపుదార్లు తన్నుకుపోయారంటూ ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ల బాధితుల లిస్ట్ పెద్దగానే ఉంది.

- విశాఖ దక్షిణ సీటును ఆ నియోజకవర్గానికి చెందిన సాధిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావు, టీడీపీ నేత గండి బాబ్జీ ఆశించారు. కానీ ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలోకి జంప్ చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు.
- జనసేనలో పెందుర్తి సీటును ఆశించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారు. తీరా ఆ టికెట్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన పంచకర్ల రమేష్‌బాబుకు ఇచ్చారు. దీంతో షాక్ తిన్న శివశంకర్ పత్తా లేకుండాపోయారు. ఇక టీడీపీలో అదే స్థానంపై గంపెడాశలు పెట్టుకున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా తీవ్ర అసంతృప్తికి లోనై అనారోగ్యం పాలయ్యారు.
- గాజువాక స్థానంపై నమ్మకం పెట్టుకున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకు కాకుండా పొత్తులో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు కేటాయించడం ఆయనకు మింగుడు పడలేదు.
- భీమిలిలో పదేళ్ల నుంచి జనసేన కోసం కష్టపడుతున్న పంచకర్ల సందీప్‌కు సీటిస్తామని పవన్ హామీ ఇచ్చారు. కానీ ఆఖరు నిమిషంలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కేటాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే స్థానాన్ని ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుకు గట్టిగానే షాక్ తగిలింది.
- విశాఖ ఉత్తర స్థానాన్ని ఆశించిన జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌కు కూడా ఆశాభంగమే ఎదురవడంతో ఆమె ఉసూరుమంటున్నారు.
- అనకాపల్లి టికెట్ ఆశించి జనసేన ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న పరచూరి భాస్కరరావుకు ఝలక్ ఇచ్చి.. నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు సీటిచ్చారు. దీంతో పరుచూరి ఆ పార్టీకో నమస్కారం అంటూ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇదే సీటును ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ డీలా పడ్డారు.
- మాడుగుల సీటు కోసం పార్టీలో పనిచేస్తున్న పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులను కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు కేటాయించడంతో వీరిద్దరూ తమ అధినేత చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు.
- యలమంచిలి టీడీపీ సీటు తనదేనని ఆశించిన ప్రగడ నాగేశ్వరరావుకు షాకిచ్చి జనసేన సుందరపు విజయకుమార్‌కు కేటాయించారు. దీంతో ప్రగడ తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

మన్యంలోనూ అంతే..

- అరకు అసెంబ్లీ స్థానాన్ని తొలుత కిడారి శ్రవణ్ కుమార్, సివేరి అబ్రహం ఆశించారు. అయితే వీరిద్దరిని కాదని చంద్రబాబు సియ్యారి దొన్నుదొరకు టికెట్ ప్రకటించారు. ఆయన జోరుగా ప్రచారం చేసుకుంటున్న తరుణంలో షాకిచ్చారు. ఆ సీటును బీజేపీ నేత పాంగి రాజారావుకు కేటాయించారు. అధినేత కొట్టిన దెబ్బకు దొన్నుదొర లబోదిబోమంటున్నారు.
- పాడేరు సీటును మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని కాదని నిన్న గాక మొన్ననే పార్టీ తీర్థం పుచ్చుకున్న రమేష్‌నాయుడుకు ఇచ్చారు. దీంతో గిడ్డి ఈశ్వరి ఇప్పుడు కుయ్యో మొర్రో అంటున్నా వినే వారే లేకుండాపోయారు. ఈ టికెట్‌ను ఆశించిన మత్స్యరాస మణికుమారి, ఎం.వి.వి.ప్రసాద్‌కు హ్యాండ్ ఇచ్చారు.
- రంపచోడవరంలో ఐదేళ్లుగా టీడీపీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని పక్కనబెట్టి ఇటీవలే పార్టీలో చేరిన శిరీషకు టికెట్ ఇచ్చారు. తమ నాయకుడు చంద్రబాబు ఇచ్చిన షాక్ నుంచి ఆమె ఇంకా తేరుకోలేదు.
- ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్‌లు వారినే నమ్ముకున్న వారిని కాకుండా పార్టీలు ఫిరాయించి వచ్చిన వారికి, డబ్బున్న వారికి పెద్ద పీట వేస్తూ సీట్లిచ్చి తమ భవిష్యత్తుకు గండి కొట్టారంటూ వారు తీవ్రంగా మదన పడుతున్నారు.
- విశాఖ ఎంపీ టికెట్‌ను బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆశించారు. ఆయన మూడేళ్లుగా విశాఖలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సీటు తనదేనన్న ధీమాతో ఉన్న తరుణంలో ఆయనను పక్కనబెట్టి టీడీపీకి చెందిన ఎం. శ్రీభరత్‌కు ఇచ్చారు.
- అనకాపల్లి ఎంపీ సీటును ఆశించిన సీనియర్లకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. చింతకాయల విజయ్, దిలీప్ చక్రవర్తి పార్టీ టికెట్‌ను ఆశించారు. వీరిని పక్కనబెట్టి ధన బలం ఉన్న కడప జిల్లాకు చెందిన సీఎం రమేష్‌కు ఇవ్వడంతో వారు కంగుతిన్నారు.

టీడీపీ ప్రచారంలో దేవస్థానం ఉద్యోగి



వెలగపూడితో చర్చిస్తున్న రాజు

ఎంవీపీ కాలనీ: టీడీపీ ఎన్నికల ప్రచారంలో సింహాచలం దేవస్థానం ఉద్యోగి పాల్గొన్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న వాసుపల్లి రాజు కొద్ది రోజులుగా ఎంవీపీ కాలనీలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు వెంట తిరుగుతూ ప్రచారం చేస్తున్నాడు. ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న రాజు.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధన లు భేఖాతర్ చేస్తున్న రాజుపై ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూటమి సమావేశానికి ఉషాకిరణ్ డుమ్మా

సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జరిగిన కూటమి సమన్వయ కమిటీ సమావేశానికి జనసేన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ డుమ్మా కొట్టారు. కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు మద్దతుగా సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం సమన్వయ సమావే శం జరిగింది. జనసేన నగరాధ్యక్షుడు వంశీకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, బీజేపీ నగరాధ్యక్షుడు రవీంద్రరెడ్డి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తర టికెట్ ఆశించి భంగపడ్డ ఉషాకిరణ్ మాత్రం గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కూటమి అభ్యర్థి ఖరారు కాకముందు జనసేన నాయకులతో సమావేశమైన ఆమె.. ఉత్తరంలో విష్ణుకుమార్‌రాజు కంటే తానే బలమైన అభ్యర్థినని బహిరంగంగా ప్రకటించుకున్న విషయాన్ని ఇప్పుడు ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. తాజా పరిణామాలు బట్టి ఉత్తర సీటు బీజేపీకి కేటాయించడంపై ఆమె ఇంకా అసంతృప్తిగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

కొత్త ఏడాది.. అన్నీ విజయాలే..

- ప్రజలకు ధర్మబద్ధపాలన అందుతుంది
- పంచాంగకర్త రొంపిచర్ల సింగరాచార్యులు
- మూలాలు మర్చిపోకుండా పండగలు నిర్వహించుకోవాలి
- కలెక్టర్ మల్లికార్జున పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

బీచ్‌రోడ్డు: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అన్నీ విజయాలే అని పంచాంగ కర్త రొంపిచర్ల సింగరాచార్యులు అన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం అత్యంత వైభవంగా ఉగాది వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ హాజరు కాగా.. అర్చకులు, వేదపండితులు పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. వాయిద్యాలు, మేళతాళాల నడుమ సంప్రదాయ రీతిలో వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం రొంపిచర్ల సింగరాచార్యులు పంచాంగం చదివి వినిపించారు. ఈ ఏడాది జిల్లా ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. ప్రజలు ఆర్థిక పురోగతి సాధిస్తారని, మంచి జీవనాన్ని కొనసాగిస్తారన్నారు. అధికార యంత్రాంగం ద్వారా ప్రజలకు ధర్మబద్ధమైన సుపరిపాలన అందుతుందన్నారు. కొన్ని ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ నిలదొక్కుకునే పరిస్థితి ఉంటుందన్నారు. షడ్రుచుల సమ్మేళనం మాదిరి ఈ ఏడాది మంచి చెడులు కలగలసి.. ప్రజల జీవనం ఆశించిన విధంగానే ఉంటుందన్నారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా సింగరాచార్యులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

మూలాలను మర్చిపోకూడదు

సంప్రదాయాలు, తెలుగు మూలాలను మర్చిపోకుండా పండగలు నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో జీవించాలని, రాజపూజ్యం, ఆదాయం అధికంగా కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కుల మతాలకు అతీతంగా తెలుగు జాతి మొత్తం కలసికట్టుగా చేసుకునే పండగ ఉగాది అని, ఆ స్ఫూర్తిని కాపాడుతూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఐటీ విప్లవం వల్ల తెలుగు పండగలపై కాస్త ప్రభావం పడిందని విచారం వ్యక్తం చేశారు. ఆంగ్ల సంవత్సరాది వేడుకలను ఘనంగా జరుపుకునే యువత.. ఉగాది వంటి సంప్రదాయ పండగలను వైభవంగా నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు నగర ప్రజలు ముందుకు రావాలన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

దేవదాయ శాఖ ఆదేశాల మేరకు విశిష్ట సేవలందించిన అర్చకులు, సామవేద పండితులకు కలెక్టర్ మల్లికార్జున చేతులమీదుగా ఉగాది పురస్కారాలు అందజేశారు. పోర్టు ఏరియా పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు కె.అనంత వెంకట వరహా కృష్ణమాచార్యులు, పద్మనాభం మండలం పెంటలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అర్చకురాలు బి.బుచ్చమ్మ, ఆనందపురం మండలం కొల్లికానిపాలెంలోని రామాలయం అర్చకుడు వి.నరసింహాచార్యులు, బురుజుపేటలోని శ్రీకనక మహాలక్ష్మి ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాసశర్మ, అర్చకుడు వాడపల్లి గోపాలచార్యులు, సామవేద పండితులు కోట పంచముఖి శర్మ ఉగాది పురస్కారాలు అందుకున్నారు.

నేత్రపర్వం.. అప్పన్న పెళ్లి రాట ఉత్సవం



రాజగోపురంలో నుంచి పడుతున్న సూర్యకిరణాలు, పెళ్లిరాట వేస్తున్న దేవస్థానం ఈవో, అర్చకులు, సిబ్బంది

- దేవస్థానంలో పంచాంగ శ్రవణం
- స్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు
- పరవశించిన భక్త జనులు

సింహాచలం: ఉగాది పర్వదిన వేళ సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లి రాట మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ నెల 19న జరిపించనున్న వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని పెళ్లిరాట ఉత్సవాన్ని అశేష భక్తజనుల మధ్య మంగళవారం సాయంత్రం సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఘనంగా జరిపించారు.

పెళ్లికొడుకైన అప్పన్న : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెళ్లి కుమారుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థానమండపంలో కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పంచాంగ పఠనం చేశారు. తదుపరి మహిళలు, ముత్తయిదువలు పసుపుకుంకుమలతో పెళ్లిరాటలను అలంకరించారు. అనంతరం నాదస్వర వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల జేజేల మధ్య ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలో శాస్త్రోక్తంగా పెళ్లిరాటలను వేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు గిరి, రాజీవ్, వేదపండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను, శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగాలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. ఈ నెల 19న రాత్రి స్వామి వారి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవం జరగనున్నాయి.

ఆలయంలో అద్భుత దృశ్యం

ఉగాది వేళ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌పై పడిన సూర్యకిరణాలను చూసి భక్తులు పరవశించారు. ఈ అద్భుత దృశ్యం సాయంత్రం ఆలయంలో చోటుచేసుకుంది. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడటం పరిపాటి. అయితే మూడేళ్ల నుంచి వర్షం, మబ్బుల కారణంగా సూర్య కిరణాలు స్వామిపై పడకపోవడంతో ఆ అవకాశం కలగలేదు. ఈ సారి మాత్రం మంగళవారం సాయంత్రం 5.40 గంటల సమయంలో ఆలయ రాజగోపురం నుంచి ఆస్థాన మండపం, భోగమండపం మీదుగా సూర్యకిరణాలు ప్రసరించి అంతరాలయంలో ఉన్న స్వామివారి మూలవిరాట్‌పై పడటంతో ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ దృశ్యాన్ని భక్తులు తిలకించేలా ఈవో శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

కొమ్మాది: ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు జరిగాయి. ముందుగా పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా పూజలు, అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు పేడాడ రమణికుమారి, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక జోనల్ విభాగం ఇన్‌చార్జి వంకాయల మారుతీప్రసాద్, ముఖ్య నాయకులు నడుంపల్లి కృష్ణంరాజు, బోని శివరామకృష్ణ, కె.రామన్నపాత్రుడు, యువశ్రీ, ముదుండి రాజేశ్వరి, రాధ, పి.శ్రీను, అప్పన్న, జి.నరేష్, మధు సంపతి తదితరులు పాల్గొన్నారు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ నేతలు

ఐదేళ్లు.. అభివృద్ధి పరవళ్లు

ప్రగతి పథంలో జీవీఎంసీ ■ మారిన విశాఖ నగర రూపురేఖలు



ఆధునికీకరించిన రైల్వే న్యూ కాలనీ జంక్షన్



నాడు-నేడులో జీవీఎంసీ పాఠశాల అభివృద్ధి

డాబాగార్డెన్స్: టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ నగర అభివృద్ధి కుంటుపడింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం జీవీఎంసీకి ఎన్నికలు కూడా నిర్వహించలేకపోయారు. పాలనంతా ఎమ్మెల్యేలు..అధికారుల చుట్టే సాగడంతో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిన సాగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నగర అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టడంతో.. ఐదేళ్ల కాలంలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. రాజకీయాలకు తావులేకుండా.. జీవీఎంసీ పరిధిలోని ప్రతీ ఒక్క నియోజకవర్గాన్ని ప్రభుత్వం సమానంగా అభివృద్ధి చేసింది.

24/7 తాగునీరు

మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.385 కోట్ల 65 లక్షలతో 24 గంటల మంచినీటి సరఫరా పథకం చేపట్టి.. 90 శాతం పనులు పూర్తి చేశారు. ఏడీబీ-యూసీసీఆర్‌టీఎఫ్ గ్రాంట్ కింద రూ.14 కోట్ల 3 లక్షలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద 3 ఎండబ్ల్యూ ఫ్లోటింగ్ సోలార్ పీవీ పవర్ ప్లాంట్, రూ.7 కోట్ల 93 లక్షలతో ముడసర్లోవ క్యాచ్‌మెంట్ ఏరియా అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

శుభ్రతలో మేటి

నగర ప్రజల సహకారం, జీవీఎంసీ యంత్రాంగం కృషితో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయ స్థాయిలో 4వ పరిశుభ్ర నగర ఖ్యాతిని, ఫైవ్‌స్టార్ రేటింగ్‌ను సాధించింది. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేసేందుకు గానూ నగర ప్రజలకు రూ.11 లక్షల 50 వేలు ఖర్చు చేసి 3 రంగుల చెత్త బుట్టలు అందించారు. కాపులుప్పాడలో బయోమైనింగ్ ద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నులు లెగసి వేస్ట్‌ను మూడేళ్లలో వెలికి తీసి.. 15 ఎకరాల భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. 25 ఎకరాల విస్తీర్ణంలో చెత్త నుంచి 15 మెగావాట్ల విద్యుత్ తయారీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి.. విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

- నిత్యం వేలాది మందితో కిటకిటలాడే బీచ్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు రూ.12.55 కోట్లతో మొత్తం ఆరు బీచ్ క్లీనింగ్ యంత్రాలను సిద్ధం చేసింది. ఎప్పటికప్పుడు బీచ్‌ల్లో పేరుకుపోయిన చెత్తను ఏరివేస్తున్నారు.

గృహయోగం

నగరంలో లక్షా 37 వేల 482 మంది గృహ లబ్ధిదారులు ఉండగా, 70 వేల జగనన్న లే అవుట్లలో లక్షా 33 వేల 209 మందికి పట్టాలు అందజేశారు. వీటిలో 95,049 మందికి డీపీఆర్ పూర్తయింది. పీఎంఏవై-ఏపీ టిడ్కో గృహాల విషయానికొస్తే 300, 365, 430 ఎస్ఎఫ్‌టీ కేటగిరీలకు చెందిన 24,192 గృహాలకు గానూ 11,260 గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. అందులో 12,118 గృహాలకు రూ.317 కోట్ల 10 లక్షల బ్యాంకు రుణాలు అందజేశారు.



అభివృద్ధి చేసిన జంక్షన్లలో ఇది ఒకటి

నాడు (2014-2019) ఇదీ పరిస్థితి

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 2014-15 ఏడాదికి సంబంధించి రూ.2.16 కోట్లతో 15 పనులు పూర్తి చేసింది. 2015-16 ఏడాదిలో రూ.41.70 కోట్లతో 293 పనులు, 2016-17 ఏడాదిలో రూ.132.22 కోట్లతో 780 పనులకు 775 పనులు పూర్తయ్యాయి. రూ.97 లక్షలతో చేపట్టాల్సిన ఐదు పనులు రద్దయ్యాయి. 2017-18 ఏడాదికి సంబంధించి రూ.66.22 కోట్లతో 328 పనులు, 2018-19 ఏడాదిలో 149 పనుల్లో రూ.25.81 కోట్లతో 147 పనులు పూర్తి చేసింది. రూ.ఐదు లక్షల పనులు రద్దయ్యాయి.

పూర్తయిన పనులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయిన ఎన్ఏడీ ఫ్లై ఓవర్

- పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల వేళ ఎన్ఏడీ ఫ్లైఓవర్ నిర్మాణానికి టీడీపీ హడావిడిగా శంకుస్థాపన చేసింది. తర్వాత పట్టించుకోలేదు. కానీ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.150 కోట్ల వ్యయంతో దీన్ని పూర్తి చేసింది.
- జగదాంబ జంక్షన్‌లో పార్కింగ్ కష్టాలకు చెక్ చెబుతూ రూ.11.45 కోట్లతో దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ పార్కింగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసింది.
- వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్ ఎదురుగా ఉన్న 1.35 ఎకరాల్లో రూ.67.57కోట్లతో ఎంఎల్‌సీపీ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- రూ.7.5 కోట్లతో బీచ్‌రోడ్ పర్యాటకానికి తలమానికంగా సీహారియర్ మ్యూజియంని వీఎంఆర్డీఏ నిర్మించింది.
- రూ.14 వేల కోట్లతో లైట్ మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

నేడు (2019- 2024) అద్భుత ప్రగతి

- 2019 నుంచి 2021(కోవిడ్ సమయంలో) వరకు రూ.265.83 కోట్లతో 1,747 పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో రూ.208.12 కోట్లతో 1,454 పనులు పూర్తయ్యాయి. రూ.6.99 కోట్లతో 32 పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.9.10 కోట్లతో 51 పనులు ప్రారంభమయ్యాయి. రూ.10.01 కోట్లతో 54 పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయి. రూ.31.61 కోట్ల విలువైన 156 పనులు రద్దయ్యాయి.
- 2021 నుంచి 2024 వరకు రూ.975.89 కోట్లతో 5,165 పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో రూ.504.70 కోట్లతో 3,203 పనులు పూర్తయ్యాయి. రూ.135.79 కోట్లతో 467 పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.153.59 కోట్లతో 675 పనులు ప్రారంభం కాగా, రూ.174.01 కోట్లతో 782 పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయి. రూ.91.9 కోట్ల విలువైన 47 పనులు రద్దయ్యాయి.
- 2023-24 ఏడాదిలో రూ.205.05కోట్ల అంచనాలతో 967 పనులు చేపట్టగా.. రూ.70 కోట్ల 4 లక్షల వ్యయంతో 332 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. వార్డుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 98 వార్డులకు గానూ 938 పనులను రూ.148 కోట్ల 11 లక్షల అంచనాలతో చేపట్టారు. ఇందులో 577 పనులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

అందుబాటులో వైద్యం



వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

జీవీఎంసీ పరిధిలో రూ.32 కోట్ల 97 లక్షల వ్యయంతో 42 వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టగా, ఇందులో 40 ఆరోగ్య కేంద్రాల పనులు పూర్తయ్యాయి. 24 ఆరోగ్య కేంద్రాల మరమ్మతు పనులను రూ.2 కోట్లతో పూర్తి చేశారు. 30 ఆరోగ్య కేంద్రాలకు రూ.3 కోట్ల 41 లక్షలతో ప్రహరీలు నిర్మించారు.

మెరుగైన విద్య

నాడు-నేడులో భాగంగా తొలి దశలో రూ.20.77 కోట్లతో 59 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండవ దశలో 87 పాఠశాలలను రూ.34.79 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

జీవీఎంసీ, స్మార్ట్‌సిటీ నిధులు, బ్యాంకు ఆర్థిక సహాయంతో రెండు ప్యాకేజీల్లో రూ.940 కోట్లతో పెందుర్తి, గాజువాక ఏరియాలో భూగర్భ నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందులో శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించే పనులు పురోగతిలో ఉన్నాయి.

ఇది కదా అభివృద్ధి

తేడా ఇదీ	2014-19	పూర్తయిన పనులు	1,558
		చేసిన ఖర్చు	రూ.268.11 కోట్లు
	2019-21	పూర్తయిన పనులు	1,454
		(కోవిడ్ సమయం) చేసిన ఖర్చు	రూ.208.12 కోట్లు
	2021-24	పూర్తయిన పనులు	3,203
		చేసిన ఖర్చు	రూ.504.70 కోట్లు

సుందరమైన రోడ్లు



బీఆర్‌టీఎస్ రోడ్డు ఆధునికీకరణ

జీవీఎంసీ పరిధి మొదటి, రెండు దశల్లో 25 ప్రధాన రోడ్లను విస్తరించి అందంగా తీర్చిదిద్దేందుకు రూ.140 కోట్ల 15 లక్షలతో ప్రతిపాదించారు. ఓ రోడ్డు పూర్తవ్వగా.. 15 పనులు పురోగతిలో, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రోడ్ల మరమ్మతులకు సంబంధించి అన్ని జోన్లలో మూడు దశల్లో 13,325 గోతుల మరమ్మతులకు రూ.16 కోట్ల 33 లక్షలతో పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.28 కోట్ల అంచనాలతో 14 పనులు చేపట్టగా, 8 పనులు పూర్తయ్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. పలు జంక్షన్ల అభివృద్ధికి రూ.7 కోట్ల 50 లక్షల అంచనాలతో 16 పనులు చేపట్టారు.

గాజువాకకు పట్టాభిషేకం

కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌసింగ్ సొసైటీ భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపించారు. జీవో నంబర్ 301 , 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్ అందజేశారు. సుమారు రూ.1,500 కోట్ల విలువైన భూమిని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన అందజేశారు. గాజువాక హౌసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ ఆక్రమిత భూములలో నివాసం ఉంటున్న 7,026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించారు. 39 మంది ఉక్కు కర్మాగార నిర్వాసితులకు కన్వేయన్స్ పట్టాలు, 40 మంది ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

థీమ్ పార్కులు

జీవీఎంసీ పరిధిలో 8 థీమ్ పార్కులను జీవీఎంసీ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం రూ.11.97 కోట్లు మంజూరు కాగా.. వీటిలో రెండు పార్కుల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ముగింపు దశలో ఉన్నాయి. జీవీఎంసీ నిధులతో శివాజీ పార్కులో ఏడు ఫౌంటైన్లను రూ.50 లక్షలతో అభివృద్ధి పరిచారు. స్మార్ట్ సిటీ నిధులు 3 కోట్ల 86 లక్షలతో నాలుగు ఫౌంటైన్ల పనులు చేపట్టగా.. రెండు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో 9 ఫౌంటైన్ల పనులను రూ.కోటి 50 లక్షలతో పూర్తి చేశారు. ఓ ఫౌంటెన్ ప్రారంభ దశలో ఉంది.



మురళీనగర్‌లో అభివృద్ధి చేసిన పార్కు

పార్కు పేరు	పార్కు ఉన్న ప్రదేశం	ఖర్చు చేసిన వ్యయం
జీవీఎంసీ థీమ్ పార్క్	ఎంఎస్సార్ లే అవుట్	రూ.1.94 కోట్లు
యోగా, మెడిటేషన్ థీమ్ పార్క్	పీఎంపాలెం లాస్ట్ బస్టాప్	రూ.1.92 కోట్లు
స్పోర్ట్స్ థీమ్ పార్క్	బక్కన్నపాలెం	రూ.1.95 కోట్లు
పామ్ గార్డెన్స్ థీమ్ పార్క్	వైఎల్పీ లేఅవుట్, ఎండాడ	రూ.1.34 కోట్లు
శివాజీ పార్క్	శివాజీ పాలెం	రూ.1.53 కోట్లు
ఎంవీపీ సెక్టార్-11 పార్క్	ఎంవీపీ సెక్టార్-11	రూ.1.12 కోట్లు
స్పోర్ట్స్ థీమ్ పార్క్	సుజాతనగర్	రూ.1.78 కోట్లు
ఏపీహెచ్‌బీ కాలనీ పార్క్	గాజువాక	రూ.4.90 కోట్లు



చూడముచ్చటగా బీచ్‌రోడ్డులో గోకుల్ పార్కు

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిష్ స్పోకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం'' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ''ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేని పక్షంలో 98660 06662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం'' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

విభిన్న కథాంశంతో 'లవ్‌మౌళి'

సీతమ్మధార: 'లవ్ మౌళి' చిత్రం హీరోగా నాకు మంచి బ్రేక్ ఇస్తుందని నటుడు నవదీప్ అన్నారు. ఆయన హీరోగా పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించిన చిత్రం లవ్ మౌళి. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం శరత్ థియేటర్‌లో సినిమా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ తాను విశాఖ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఎన్నో చిత్రాల షూటింగ్‌లో పాల్గొన్నానని గుర్తు చేశారు. ఈ చిత్రంలో నటించిన భావన విశాఖ అమ్మాయే అని చెప్పారు. తాను ఎంతో ఇష్టంతో చేసిన సినిమా ఇదని, మేఘాలయలో 70 రోజుల పాటు కష్టపడి షూటింగ్ చేశామన్నారు. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 19న విడుదల అవుతుందన్నారు. న్యూసెన్స్-2 త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుందని వెల్లడించారు. హీరోయిన్ మాట్లాడుతూ ఈ సినిమా అందరికీ నచ్చుతుందన్నారు. ఈ చిత్రం కోసం తెలుగు నేర్చుకున్నట్లు చెప్పారు. నటి భావన మాట్లాడుతూ ఈ సినిమా చేయ డం ఆనందంగా ఉందన్నారు. అనంతరం చిత్ర బృందం ప్రేక్షకులతో ముచ్చటించింది.

ఖైనీ, గుట్కా స్వాధీనం

మల్కాపురం: ఇంట్లో నిల్వ చేసిన ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, తదితర ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీవీఎంసీ 59వ వార్డు లేబర్ జంక్షన్ వద్ద కృష్ణ అనే వ్యక్తి ఇంటిలో సుమారు రూ.1.06 లక్షల విలువ చేసే ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ ప్యాకెట్లు వున్నా యి. దీనిపై సిటీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి మల్కాపురం పోలీస్ అధికారుల సాయంతో ఆ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

డబ్బు కోసమే హత్య?

- వివాహిత మృతి కేసులో కీలక మలుపు
- విచారణ చేస్తున్న పోలీసులు




ఈశ్వరి మృతదేహం

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత అనుమానాస్పద మృతి కేసు మలుపు తిరిగింది. పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ద్వారకా సబ్ డివిజన్ ఏసీపీ రాంబాబు, నేతృత్వంలో సీఐ ఎస్.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. మృతురాలు కుమార్తె ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో నిందితుడు సయాద్ అలీని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకానగర్ రెండోలైన్‌లోని రామ్స్ ప్లాజాలో మృతురాలి తండ్రి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రితోపాటు కుమార్తె కలదారపు ఈశ్వరి (33), అల్లుడు దుర్గాప్రసాద్, వీరి పిల్లలు రెండేళ్ల బాబు, ఎనిమిదేళ్ల పాపతో కలిసి ఉంటున్నారు. ఐదేళ్లుగా డైమండ్ పార్కు సమీపంలో ఒక హోటల్లో సయాద్ అలీ కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈశ్వరి కూడా అక్కడే పనిచేసేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. అలీ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కూడా పనిచేస్తున్నాడు. దీంతో ఈశ్వరితో బీమా కట్టించాడు. ఆ బీమా గడువు తీరడంతో ఆఫీసుకు రావాలని ఆమెను తీసుకువెళ్లాడు. ఈక్రమంలో డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందని తెలిసింది. దీంతో ఆంధ్రాయూనివర్సిటీలోని ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి ఈశ్వరి ముఖంపై క్లాత్‌తో ఊపిరి ఆడకుండా చేయడంతో అక్కడక్కడే మృతి చెందిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిని కప్పిపుచ్చుకునేందుకు హత్యను రోడ్డు ప్రమాదంగా అలీ చిత్రీకరించినట్టు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిందంటూ రామ్స్ ప్లాజాకు ఆటోలో తీసుకొచ్చి.. తండ్రికి అప్పగించి వెళ్లిపోయాడు. ఈశ్వరి తండ్రి 108కు సమాచారం అందించగా వారొచ్చి చూసేసరికి మృతి చెందిందని నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈశ్వరి కుమార్తె ద్వారా కొంత సమాచారాన్ని పోలీసులు తెలుసుకున్నారు. అలీ ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులు అనుమానం వచ్చింది. రాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కూల్.. చిల్








ఆరిలోవ: ఎండలు దంచి కొడుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటు మనుషులే కాదు.. అటు జంతువులు సైతం ఎండ వేడికి అల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కులో అధికారులు వేసవి నుంచి జంతువులు, పక్షులకు ఉపశమనం కలిగించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కూలర్లు, ఏసీలు, వాటర్ స్ప్రింక్లర్లు, గ్రీన్ కర్టెన్లు, గోనె సంచులు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకున్నారు. వన్యప్రాణుల శరీరంలో చల్లదనం కోసం బలవర్ధకమైన ఆహారంతో పాటు మల్టీ విటమిన్లు అందిస్తున్నారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కొనసాగుతున్న మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మూడో నంబర్ గేట్ వద్ద కుంగిన పాదచారుల వంతెన మరమ్మతులు మంగళవారం కూడా కొనసాగాయి. రెండు, మూడు ప్లాట్‌ఫాంల మధ్య కుంగిన భాగాన్ని భారీ క్రేన్లతో తొలగించారు. వేరే గడ్డర్లను వెల్డింగ్ ద్వారా జతచేస్తున్నారు. బుధవారం నాటికి ఈ పనులు పూర్తి కావచ్చని అధికారవర్గాలు తెలిపాయి.

కోడ్ ఉల్లంఘించారు.. సంజాయిషీ ఇవ్వండి

సీఎం రమేష్, అయ్యన్నలకు ఈసీ నోటీసులు

నర్సీపట్నం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని పేర్కొంటూ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు, టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి సీహెచ్ అయ్యన్నపాత్రుడికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈనెల 6న నర్సీపట్నం కృష్ణాప్యాలెస్‌లో బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌తోపాటు అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సీఎం రమేష్ చీరతోపాటు రూ.2 వేలు చొప్పున నగదు పంపిణీ చేశారు. చీరలు, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లగా సీఐ కాంతి కుమార్, పోలీసులతో రమేష్ వాగ్వాదానికి దిగారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై చిందులేశారు. చీరలు పంచితే తప్పేమిటని దబాయించారు. కోడ్ ఉల్లంఘించినందున సంజాయిషీ ఇవ్వాలని నర్సీపట్నం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం సీఎం రమేష్ వాట్సప్‌కు నోటీసు పంపించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు సాక్షాత్తు చీఫ్ సెక్రటరీ, డీజీపీలపై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా ఎప్పుడు మాదిరి అధికారులపై తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. దీంతో ఆయనకు కూడా ఆర్వో జయరాం నోటీసులు జారీ చేశారు.